క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పర్చూరు: పేద, మధ్య తరగతులకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన విద్యార్థులు గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో విద్యనభ్యసించేందుకు ఏప్రిల్ 23వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని నాగులపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విశ్వరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ఐదో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకూ చదువుకోవచ్చన్నారు. ఐదో తరగతికి 80, ఇంటర్‌లో 80 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తు

చినగంజాం: విద్యాహక్కు చట్ట ప్రకారం పేద విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యను పొందేందుకు ఏప్రిల్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో డీ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతిలో 25 శాతం సీట్లను లాటరీ పద్ధతిలో అడ్మిషన్ కల్పించి ఉచిత విద్యనందిస్తున్నారని అందుకోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ప్రవేట్ పాఠశాలలో అడ్మిషన్ కోసం అందుబాటులో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థికి ఐదేళ్లు నిండి ఉండాలని అడ్మిషన్స్ లాటరీ పద్ధతిలో కేటాయిస్తారని చెప్పారు.

సైన్స్ కళాశాలకు మృతదేహం దానం



ఏడుకొండలు (ఫైల్)

జే.పంగులూరు: గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని కోటపాడు గ్రామవాసి, బత్తుల ఏడుకొండలు (55) మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు, వైద్య కళాశాలకు దానం చేశారు. ఏడు కొండలు శనివారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. చనిపోయిన తరువాత ప్రార్థివ దేహం వైద్య కళాశాలలో వైద్య విద్య చదువుకునే విద్యార్థులకు ఉపయోగ పడుతుందనే ఉద్దేశంతొ ఏడు కొండలు సోదరుడు నాగేశ్వరరావు భార్య రమణ మృతదేహాన్ని దానం చేసేందుకు ఒప్పుకున్నారు. వెంటనే అమ్మ నేత్రం అవయవ శరీరం దానం ప్రోత్సాహకం సంఘం వ్యవస్థాపకులు గుంజి ఈశ్వరలింగం సహకారంతో విజయవాడ నిమ్స్ కళాశాల నిమ్రా ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు శరీరాన్ని దానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ పంగులూరు బాధ్యులు సుబ్బారావు, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, చలపతిరావు పాల్గొన్నారు.

నేడు జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ

అద్దంకి రూరల్: వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.04 గంటలకు స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో జాతి మహాత్మ గాంధీ, అమరజీవి పొట్టిశ్రీరాములు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, వైశ్యరత్న కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాలు ఆవిష్కరించనున్నట్లు సంఘ అధ్యక్షుడు సోమిశెట్టి సుబ్బారాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, గిద్దలూరు శాసన సభ్యుడు అన్నావెంకటాంబాబు, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య హాజరవుతారని తెలిపారు.

భక్తులకు గంధం పంపిణీ



గంధపు పాత్రలను పీర్ల చావిడి నుంచి ప్రదర్శనగా తరలిస్తున్న నిర్వాహకులు

మార్టూరు: మండల కేంద్రంలోని సయ్యద్ హజరత్ కరిముల్లాషా దర్గా 47వ ఉరుసు ఉత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక పీర్ల చావిడి వద్ద ఉంచిన గంధాన్ని మత పెద్దలు ఫాతిహా నిర్వహించగా గంధం పాత్రలను గుర్రం మీద స్థానికులు భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించి భక్తులకు వీధుల వెంట పంపిణీ చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ నిర్వాహకులు పఠాన్ అజిత్,పెద్ద కరిముల్లా, నూర్ అహ్మద్, గౌస్, దర్గా ముజువర్ సాహెబ్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ సేవలు

చీరాల: ప్రాణాపాయంలో ఉన్న క్షతగాత్రులతో పాటు వివిధ రకాలైన శస్త్రచికిత్సలు అవసరమైన హృద్రోగులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ సూచించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు త్వరగా అందించాలనే సంకల్పంతో నూతనంగా అందించిన కియోస్క్ సెంటర్ హాస్పిటల్ నిర్వాహకులు ప్రారంభించారు. ఈసందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు అవసరమైన ఆపరేషన్లు త్వరగా అందించేందుకు కియోస్క్ ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ తులసీరామ్, సురేష్, నారాయణ, ఆరోగ్య మిత్ర జి.అనీల్‌కుమార్, బోయోజ్ ఉన్నారు.



కేవీ పాలెంలో మొక్కజొన్న ధాన్యం తడవకుండా పట్టాలు కప్పిన రైతు



అద్దంకి: ఇటుక గుట్టలపై పట్టాలు కప్పిన యజమానులు

అకాల వర్షాలతో రైతన్నల అవస్థలు

వేటపాలెం: అకాల వర్షాలతో రైతులు పలు అవస్థలు పడుతున్నారు. వరి పంటకోత దశకు రావడంతో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి కోతలు నిలిచి పోయాయి. తీర ప్రాంత భూముల్లో సాగు చేసిన వేరుశనగ పంట కోసి కాయలు ఆరబోశారు. వర్షాలకు కాయలు తడవకుండా పట్టాలు కప్పి కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి వరి చేలల్లో నీరు నిల్వడంతో పూర్తిగా ఆరితేనే కోతలు కోయడానికి వీలుపడదని రైతులు తెలిపారు.

జే.పంగులూరు/బల్లికురవ/ అద్దంకి: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. మిర్చి రైతులు, శనగ, మొక్కజొన్న లేత పంట, పొగాకు పంటల రైతులకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. మిర్చి పంట ఎక్కువగా తాలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అద్దంకి మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం నుంచి దఫాల వారీగా జల్లులు పడుతున్నాయి. దీంతో పంటకు వచ్చిన మొక్కజొన్న, పసుపు, ఆకుకూరలు రైతులు ఇంతకు మించిన వర్షం పడితే ఇబ్బందులు తప్పవంటున్నారు. కాగా ఇప్పటికే అద్దంకి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, శంకరాపురం, అద్దంకి పట్టణంలని ఇటుక బట్టీల యజమానులు ఎండిన ఇటుకపై పట్టాలు కప్పారు. బల్లికురవ మండలంలోని ఉప్పుమాగులూరు, గంగపాలెం, సోమవరప్పాడులో మోస్తరు వర్షం కురిసింది.



జే.పంగులూరు: కల్లాల్లో మిర్చి పంటకు పట్టాలు కప్పుతున్న రైతులు



వేటపాలెం: వేరుశనగ కాయలు తడవకుండా పట్టాలు కప్పిన రైతు

వైభవంగా రామలింగేశ్వరుడి తిరునాళ్ల



మట్టి శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న నాగసాధువులు



ఉప్పుమాగులూరు తిరునాళ్లలో ఏర్పాటు చేసిన ప్రభ

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలో వేంచేసిఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి శివుడికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అన్నదానం చేపట్టారు. భారీ ఎలక్ట్రిక్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం హిమాలయ నాగ సాధువుల బృందంతో వివిధరకాల పత్ర, పుష్ప, ఫల రసాలతో మూడు అడుగులు మట్టి శివ లింగానికి గంటపాటు అభిషేకం చేశారు. స్వామి జ్ఞాన ప్రసన్నగిరిచే ఢమరుక ఘంట, శంఖారావంతో హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామ స్మరణతో కై లాస వాతావరణంలో రుద్రాభిషేకం, భస్మాభిషేకం హరతులు, నివేదనలు చేపట్టారు. బల్లికురవ ఎస్సై వీ. వేమన తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సైన్స్‌పై మక్కువ పెంచేందుకే ప్రదర్శనలు



విజేతలతో ఎంఈవో, ఉపాధ్యాయులు

చీరాల: ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సృజనాత్మకతకు పదునుపెట్టేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం చేస్తాయని మండల విద్యాశాఖాధికారి డీ.నాగేశ్వరరావు అన్నారు. గత నెల 28న నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్లలో పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు అందరిని అలరించడంతో పాటుగా పతకాలు సాధించారు. దీంతో శనివారం పేరాల హైస్కూల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు క్రియ సంస్థ అందించిన పతకాలు, మోడళ్లను ఎంఈవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాల్మన్‌రాజ్, ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి, గాంధీ, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాత చీఫ్ మేనేజర్

అద్దంకి రూరల్: ఉగాది పండగ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అద్దంకి మెయిన్ బ్రాంచ్ ఛీఫ్ మేనేజర్ కె. దివాకర్ శనివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, పెన్నులు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు సహాయం చేస్తున్నానని అదేవిధంగా ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులకు అందించటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు ఎస్ కోటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్కానర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న దాత

అద్దంకి: ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు దాత మారం జయరామిరెడ్డి రూ.18 వేలు విలువ చేసే ప్రింటర్ కమ్ స్కానర్‌ను శనివారం హెచ్‌ఎం రాఘవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఒక వైపు నాడు నేడు పథకంలో ప్రభుత్వం పాటశాలను తీర్చి దిద్దుతోందన్నారు. మరో వైపు దాతల సాయం విద్యాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. దాత మారం జయరామిరెడ్డిని ప్రశంసించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేరం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుంకర శ్రీదేవి, జానీబేగం, విశాలక్షి, ఎస్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, రైతు నాయకులు

మార్టూరు: మండలంలోని వలపర్ల ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం అధికారులు, నాయకుల ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్ పర్సన్ పసుమర్తి లోకనాథం, సీఈవో ఈదర నాగేశ్వరరావులు మాట్లాడుతూ శనగలు బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు ఒకటికి రూ.4500లు ఉండగా ప్రభుత్వం మద్దతు ధర రూ.5335లుగా ఉన్నందున రైతుకు క్వింటాకు రూ 800లు పైగా లాభం చేకూరుతుందని తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న వివరాల ప్రకారం శనగల కొనుగోలు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి ఉపాధ్యాయుల సంతాపం



ప్రదీప్ (ఫైల్)

జే.పంగులూరు: మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి కుంచాల ప్రదీప్ మృతికి శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. బ్లడ్ క్యాన్సర్‌తో ప్రదీప్ శుక్రవారం మరణించాడు. విద్యార్థి జ్ఞాపకాలను తలచుకుని మృతికి పాఠశాల ప్రధానోధ్యాయుడు గుమ్మ శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ కీర్తి శ్రీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలియజేశారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం . ఉత్తరాయణం పాల్గుణ మాసం ధనిష్ఠ నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆట, పాటల్లోనూ ముందుంటాం..

స్వర్ణపాలెం (కారంచేడు): ప్రతి రోజు చక్కగా చదువుకోవడంతో పాటు నో బ్యాగ్‌డే సందర్భంగా ఆట, పాటల్లోనూ మేమే ముందుంటామని స్వర్ణపాలెం విద్యార్థులు విన్యాసాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో శనివారం నో బ్యాగ్‌డేను నిర్వహించారు. మండలంలోని స్వర్ణపాలెం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇంగ్లిషు అక్షరాలను పోలి ఉండేలా ఏ టూ జెడ్ వరకు విన్యాసాల ద్వారా మిగిలిన విద్యార్థులకు చూపించారు. వీటిని గమనించిన విద్యార్థుల సంతోషంగా, ఆహ్లాదంగా కేరింతలు కొట్టారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో హెచ్‌ఎం నరశింహారెడ్డి, ఉపాధ్యాయుడు పీ కోటేశ్వరరావులు కృషి చేశారు.

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరైన పక్కాగృహాల నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేయాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. హౌసింగ్ డే సందర్భంగా కొప్పరపాడు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లోని లబ్ధిదారులతో మాట్లాడారు. మండలంలోని 80 గృహాలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని ఎంపీడీవో తెలిపారు. బిల్లుల చెల్లింపులో ఎటువంటి జాప్యం లేదని వివరించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి



కేశవరప్పాడులో నిర్మాణాలు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రామారావు



చీరాలనగర్ లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలపై సూచనలందిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

కారంచేడు: సచివాలయ భవన నిర్మాణాలను త్వరతిగతిన పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. శనివారం ఆయన మండలంలోని కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం గ్రామాల్లోని భవన నిర్మాణ పనులు పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేస్తే గ్రామాల్లో పాలనా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందన్నారు. తద్వార సేవలు అందించే వీలుంటుందన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జయప్రకాష్, నరశింహారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహప్రవేశాలు చేయాలి..

చీరాల టౌన్: నిరుపేదలకు కలగా ఉన్న సొంతింటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఉగాది పండుగ రోజు లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. హౌసింగ్ డే పురస్కరించుకుని శనివారం చీరాల మండలంలోని చీరాలనగర్ 1,2 లేఅవుట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో కే నేతాజీలు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

అన్నమాచార్య కీర్తనలు అజరామరం



అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్

అద్దంకి రూరల్: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య నేటికి మరువలేనివని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. శనివారం అన్నమాచార్య 520 వర్ధంతి సందర్భంగా స్థానిక అన్నమాచార్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి వారిపై 32 వేల కీర్తనలు అన్నమయ్య రచించాడన్నారు. నేటికి అన్నమచార్య కీర్తనలతోనే వెంకటేశ్వరస్వామిని పూజిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, శింగరకొండలో లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం సభ్యుడు అడవి వెంకటేశ్వర్లు, ఘంటసాల గానభారతి సెక్రటరీ గోగులమూడి శేషగిరి, బత్తుల రామాంజనేయులు, బత్తుల బాలు తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ బోల్తా, ఒకరికి గాయాలు



కాలువలో దూసుకెళ్లిన మినీ లారీ

చినగంజాం: మినీ లారీ బోల్తా కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈఘటన శనివారం చినగంజాం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై కట్టా అనుక్ వివరాల మేరకు.. చీరాల నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ మినీ లారి చినగంజాం మండల పరిధిలోని రాజుబంగారుపాలెం మలుపు వద్ద జాతీయ రహదారిపై అదుపు చేయలేక పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. వాహనంలో ఒంగోలు సమీపంలోని పేర్నమిట్ట గ్రామానికి చెందిన డ్రైవర్ చుక్క శ్రీకాంత్, అతనితో పాటు చుక్క సుబ్బారావు, మరో వ్యక్తి చుక్క రవికుమార్‌లు ప్రయాణిస్తున్నారు. సుబ్బారావు అనే వ్యక్తికి కుడి కాలికి గాయం కావడంతో 108 వాహనంలో ఒంగోలు తరలించగా మిగిలిన ఇరువురు ఎటువంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ -కేవైసీ చేస్తేనే పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో సత్తార్

పర్చూరు: కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6000 రావాలంటే రైతులందరూ ఈ నెలాఖరులోపు పీఎం కిసాన్ ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని డీఏవో సత్తార్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల ఆర్బీకే సిబ్బంది వీఏఏ లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ త్వరలో మూడు లేదా నాలుగు రోజుల్లో శనగల కొనుగోలు జరుపుతామని తెలిపారు. క్వింటాకు రూ. 5335లకు కొనుగోలు చేస్తామని చెప్పారు. శనగలు అమ్ముకునే రైతులు ఈనెల 31వ తేదీ లోపు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్రావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఏవోలు రామ్మోహన్ రెడ్డి, సమరనాథ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబడితో రైతులకు మేలు



శనగ రైతులకు సూచనలందిస్తున్న ఉద్యానశాఖ సిబ్బంది

చీరాల టౌన్: అన్నదాతలకు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట దిగుబడులు పెంచేలా సూచనలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను తెలియజేసేందుకు నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ పొలంబడితో రైతులకు మేలు జరుగుతుందని ఆర్‌బీకే చైర్మన్ కే.రమణారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా శనగ పంటలను వ్యవసాయాధికారులు, ఉద్యానశాఖ ఉద్యోగులు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. శనగ పంట సాగులో ఖర్చులు తగ్గించుకుని సేంద్రీయ ఎరువులను వినియోగించడం వలన పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అధికారి మేరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవిత, గ్రామంలో రైతులు పాల్గొన్నారు.